క్లుప్తంగా

వాహనాల వేలం వాయిదా

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని సారాయి కేసులో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 22న నిర్వహించే వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రజిత బుధవారం తెలిపారు. నాలుగు రోజుల పాటు తుఫాన్‌తో కూడిన వర్షం వస్తున్నందున తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు, తదుపరి వేలం పాట తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు.

జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ లింగయ్యకు సన్మానం


కొంపల్లి లింగయ్యను సన్మానిస్తున్న ఎస్పీ

సూర్యాపేటటౌన్ : ఇటీవల రెండు నేరాల్లో నిందితులకు శిక్షలు పడేలా వాదనలు వినిపించిన జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి లింగయ్యను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ కె.నరసింహ సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ శిక్షలు పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్, కోర్టు లైజన్, కోర్టు డ్యూటీ సిబ్బంది సమన్వయ కృషి ఫలితమేనన్నారు. ఈ విజయాలు నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు నిదర్శనమన్నారు.

చివ్వెంల పీఏసీఎస్ స్టాఫ్ అసిస్టెంట్ సస్పెన్షన్

చివ్వెంల : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన యల్క కృష్ణారెడ్డి ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడినట్లు స్థానిక రైతులు గ్రీవెన్స్ డేలో మండల కేంద్రానికి చెందిన మిర్యాల సీతారామ్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు తెలువడంతో కృష్ణారెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా కోపరేటివ్ అధికారి పద్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు చివ్వెంల కార్యాలయానికి ఉత్తర్వులు అందినట్లు సీఈఓ వాసు తెలిపారు.

పిడుగుపాటుకు మేకలు, గొర్రెలు మృతి

చివ్వెంల : పిడుగుపాటుకు గురై మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గంటోని గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు తమ గొర్రెలను మండలంలోని గంటోని గ్రామ శివారులో వ్యవసాయం పొలంలో మేపుతుండగా సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పిడుగులు పడడంతో మున్న బక్కయ్యకు చెందిన 2మేకలు, 1గొర్రె, పేర్ల వెంకయ్యకు చెందిన 7మేకలు, పేర్ల సైదులుకు చెందిన 2మేకలు మృతి చెందాయి. వాటి విలువ రూ.1.20లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

సూర్యాపేటటౌన్ : పిడుగుపాటుకు 10 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని 8వవార్డు సీతారాంపురం కాలనీలో చోటు బుధవారం చేసుకుంది. గ్రామానికి చెందిన మేడుదుల మల్లయ్య తన గొర్రెలు, మేకలను నల్లచెరువుతండాలో మేపుతుండగా వర్షంతో పాటు పిడుగు పడడంతో 10 గొర్రెలు, మేకలు అక్కడిక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. మృతి చెందిన గొర్రెలు, మేకల విలువ రూ.1,50,000 ఉంటుందని వాపోయారు.

ఎస్సారెస్పీ మైనర్‌కాల్వ మరమ్మతు

అర్వపల్లి : ఎస్సారెస్పీ కాల్వలు కొన్నేళ్లుగా ఎలాంటి మరమ్మతులు లేక పూడికతో పాటు కంపచెట్లతో నిండిపోయాయి. దీంతో ఉపాధి హామీ పథకంలో రూ.6లక్షలు వెచ్చించి మండల పరిధిలోని రామన్నగూడెం నుంచి అర్వపల్లి శివారు వరకు గల ఎస్సారెస్పీ మైనర్‌కాల్వలో పూడికతీత, చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. సుమారు 1500 మీటర్ల మేర మైనర్ కాల్వలో పూడిక తొలగించడం, కంపచెట్లు, రాళ్లు తొలగించే పనులు చేపడుతున్నట్లు ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ దీపిక, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య తెలిపారు.

భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మద్దిరాల : అక్రమంగా తన భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుడు మారెల్లి వెంకన్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిగూడెంలో ఆయన మాట్లాడారు. మాతాతలు సర్వే నంబర్ 360లో గత కొన్ని వందల సంవత్సరాల నుంచి సేద్యం చేసుకునేవాళ్లమని కాని గ్రామానికి చెందిన గాడ్దుల లింగయ్య, యాకయ్య చాకలిబండపై మట్టి పోసి కబ్జా చేశారు. మా భూమిని మీరెలా కబ్జా చేస్తారని వారిని ప్రశ్నించగా ఈ భూమి తమదేనని దురుసుగా ప్రవరిస్తున్నారని, బెదిరిస్తున్నారని బాధితుడు వాపోయాడు. ఎన్నో ఏళ్లుగా చాకలి బండగా పిలువబడే తమకు వారసత్వంగా వచ్చిన తమ భూమిని ఆక్రమంచుకున్న వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోని తనకు న్యాయం చేయాలని బాధితుడు వాపోయాడు. ఆ భూమి కబ్జాదారులకు పట్టా కాకుండా చూడాలని స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు బాధితుడు వెంకన్న తెలిపారు.

రక్షణ వలయాలు కరువు

- ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- రక్షణ చర్యలు చేపట్టని అధికారులు
- కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్


చర్చి కాంపౌండ్ ప్రాంతంలో తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



సీసీరోడ్డు మీద ఉన్న కరెంటు స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె, ఎర్త్ పైపు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : రక్షణ వలయాలు లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలోని పలు కాలనీల్లో రహదారుల వెంట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండడంతో ఆయా దారిలో వెళ్లే ప్రజలు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా విద్యుత్ లైన్ల విస్తరణ కూడా జరుగుతోంది. అయితే తదనుగుణంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు విషయంలో తీసుకోవాల్సిన కనీస నిబంధనలను కాంట్రాక్టర్లు మరిచిపోతున్నారు. అదే క్రమంలో ఆ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పట్టణంలోని జేజేనగర్, కుడకుడ రోడ్డులోని స్నేహనగర్‌లోని పలు వార్డుల్లో ట్రాన్స్‌ఫార్మర్స్‌లకు రక్షణ వలయాలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. వేసవి సెలవులు కావడంతో పిల్లలను ఆడుకోవడానికి బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్నది వర్షాకాలం కావడంతో ఎర్త్ పైపులు, చేతికి అందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలతో మరింత ప్రమాదం వాటిల్లే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయాలపై విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని రక్షణ వలయాలు..

పట్టణంలోని చర్చి కాంపౌండ్ వెనుక ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ మూడు నాలుగు అడుగుల ఎత్తులోనే ఉన్నాయి. పిల్లలకు సైతం చేతికి అందే ఎత్తులో ఉండడం, కనీసం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

రోడ్డుపైనే స్తంభాలు.. ఎర్త్‌పైపులు

పట్టణంలోని జేజేనగర్‌లోని ఒక వీధిలో సీసీరోడ్డు పైనే కరెంటు స్తంభం ఉండగా, రోడ్డు అంచున ఎర్త్ పైపు ఉండడంతో రక్షణ వలయం లేక ప్రమాదకరంగా ఉంది. ఇదే కాకుండా 60ఫీట్ల రోడ్డులో, అలాగే కుడకుడ రోడ్‌లోని స్నేహనగర్‌లోనూ ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు చోరవ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి



తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయంలో వాహనదారులకు ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పట్టణంలో రోడ్లకు ఆనుకొని ఉన్న, రోడ్లపైన ఉన్న కరెంటు స్తంభాలను తొలగించాలి. అలాగే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

– హరి, సూర్యాపేట

వర్షాలకు ఎర్త్‌వచ్చే అవకాశం ఉంది



రోడ్ల వెంట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్త్‌పైపులు వర్షం నీటిలో మునిగి వాహనాలకు తగిలితే ప్రమాదం సంభవించే అవకాలు ఉన్నాయి. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలను కాంట్రాక్టర్ ఎత్తుగా నిర్మించడంతో పాటు ఎర్త్‌వైర్లకు తగిన రక్షణ చర్యలు చేపట్టి చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

– పి.శివ, సూర్యాపేట

విప్లవ ఉద్యమంలో జెన్ను పాత్ర మరువలేనిది


ఆత్మకూర్ (ఎస్) : సమావేశంలో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ ఝాన్సీ

ఆత్మకూర్ (ఎస్) : ఉమ్మడి నల్లగొండ జిల్లా విప్లవ ఉద్యమంలో జలగం జనార్దన్ (జెన్ను) పాత్ర మరువలేనిదని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ జి.ఝాన్సీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఏపూరులో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జెన్ను 4వ వర్ధంతిని డివిజన్ కమిటీ సభ్యుడు కంచనపెల్లి సైదులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ జన్నన్న ఉండే వాడని, ప్రజలకు, కార్యకర్తలకు భరోసా కల్పించే వాడని తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి అల్లుబెల్లి వెంకటరెడ్డి, జెన్ను భార్య కళమ్మ, పార్టీ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నూతనకల్ : పీడిత ప్రజల పక్షపాతి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జెన్ను) ఆశయ సాధనకు కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జనార్దన్ 4వ వర్ధంతిలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్బంధాలు, జైలు జీవితాన్ని లెక్కచేయకుండా విప్లవోద్యమానికి అంకితమై తన జీవిత చివరి శ్వాస వరకు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాపక్షాన అలుపెరగని పోరాటం చేసిన జనార్దన్ ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, మండల కార్యదర్శి సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ముప్పాని సుదర్శన్‌రెడ్డి, కూసు ఉప్పలయ్య, వెంకన్న, మురళీ, కృష్ణయ్య, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌తో హత్యాకాండ కొనసాగిస్తుంది


కేశవరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండను కొనసాగిస్తుందని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ ఝాన్సీ, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాలా కేశవరావుతో సహా 25కి పైగా మావోయిస్టులను హత్య చేయడాన్ని ఖండిస్తూ కేశవరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, బలగాలను వెనక్కి రప్పించాలన్నారు. కార్యక్రమంలో వి.కోటేశ్వరరావు, భద్రయ్య, నారబోయిన వెంకట్‌యాదవ్, పోలేబోయిన కిరణ్, సామా నర్సిరెడ్డి, పవన్, శ్రీధర్, సోమయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్


నాగారం : ఉపాధ్యాయ శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ అశోక్

నాగారం : ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులు బలోపేతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి పాఠశాలలను బలోపేతం చేయాలని, బడిబాట ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచుకొని పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, రాగిజావ విద్యార్థుల అందరికీ అందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, మండల రిసోర్స్‌పర్సన్‌లు బి.శ్రీనివాస్, టి.సాలయ్య, వి.మల్లయ్య, శ్రీనివాసరెడ్డి, బి.భాస్కర్, ఎస్.బ్రహ్మం, ఎ.లక్ష్మణరావు, నర్సిరెడ్డి, సీఆర్పీలు హరిప్రసాద్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వృత్యంతర శిక్షణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కొనసాగుతుంది. బుధవారం రెండో రోజు 60మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. తెలుగు, గణితం, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 24వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని ఎంఈఓ బాలునాయక్ తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు వి.సైదులు, కె.రమేష్, సీహెచ్.నాగరాజు, సృజన, బి.శ్రీనివాస్‌గౌడ్, స్వరూపరాణి, ఎస్.వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం

మద్దిరాల : విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఎంఈఓ కాట్ల రవికుమార్ అన్నారు. బుధవారం మండలానికి చెందిన ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ ఉన్నత పాఠశాలలో మండల ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ తరగతుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల రిసోర్స్‌పర్సన్స్ కల్లూరి నాగయ్య, విష్ణు, వెంకటేష్, శ్రీనివాస్, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష నాగవల్లి దళార్చన


నాగవల్లి దళార్చన పూజ నిర్వహిస్తున్న వేద పండితులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీహనుమ జయంతి పంచాహ్నిక ఉత్సవాల్లో భాగంగా దరూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా లక్ష నాగవల్లి దళార్చన (తమలపాకులతో) నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్వామివారికి 11పర్యాయాలు వేద పండితులు సామూహిక శ్రీరామ సహస్ర నామాలు పటిస్తూ లక్ష తమలపాకులతో స్వామికి పూజలు నిర్వహించారు. హనుమ జయంతి వేడుకల సందర్భంగా దరూరి శ్రీనాథచార్యుల ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం నిర్వహించారు. దేవాలయ ఫౌండర్ కొత్త ఆంజనేయులు మాట్లాడారు. గురువారం స్వామి వారికి నిత్యారాధన, ప్రత్యేక సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, వెండి తమలపాకులతో అర్చన, స్వామికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి లక్ష్మణరావు, దరూరి శ్రీధరాచార్యులు, దరూరి పవన్‌కుమారచార్యులు, కార్తీకాచార్యులు, ఉప్పల లలిత, సురేష్, రామ్మూర్తి, నాగరాజు, దేవేంద్రచారి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఇస్తాళపురం మండల ప్రాథమిక పాఠశాలలో 1983 – 84సంవత్సరంలో ఏడోతరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 41సంవత్సరాల తర్వాత కలుసుకున్న ఆనాటి విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి జ్ఞాపకాలు పంచుకొని ఆనందంగా గడిపారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆనాటి గురువులు రామనాథం, అప్పారావు, నారాయణ, బాబురావు, పుల్లయ్య, పూర్వ విద్యార్థులు గండమల్ల శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తూడి శంకర్‌రావు, నీలమ్మ, కిషోర్, తావూర్య, నిర్మల, మానుపురి శ్రీనివాస్, ఇరుగు బాబు, కంచర్ల వెంకట్‌రెడ్డి, మన్సూర్ అలీ, రావుల శ్రీను, వెంకన్న, వనమ్మ, కళావతి, శ్యామల, వసంత, లలిత తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట మండల పరిధిలోని బాలెంల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ దోసపాటి గోపాల్, సెక్రటరీ రాజేంద్రప్రసాద్, ట్రెజరర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ తల్లాడ మల్లికార్జున్, డాక్టర్ క్రాంతి, విజన్ టెక్నీషియన్ బంగారు స్వాతి, క్యాంపు ఇన్‌చార్జ్ వీరేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభ కరపత్రాలు విడుదల

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురంలో గురువారం బహుజన విప్లవోద్యమ రాష్ట్ర నాయకుడు మండారి ప్రభాకర్ వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు సీపీఐఆర్‌ఎం రాష్ట్ర కార్యదర్శి చామకూరి నర్సయ్య, సామాజిక తెలంగాణ మహాసభ జిల్లా కన్వీనర్ దడిపల్లి వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ సతీమణి నిర్మల, శ్రీను ఉన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషిచేయాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్


తిరుమలగిరి : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు నేటి యువత కృషిచేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం పట్టణంలో రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, జమ్మిలాల్, వీరేష్, అశోక్‌రెడ్డి, అంబేద్కర్, రవీందర్‌రెడ్డి, డానియల్, లక్ష్మయ్య, అబ్బాస్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

భానుపురి (సూర్యాపేట) : ఐటీరంగ అభివృద్ధికి బాటలు వేసిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, వీరన్ననాయక్, రమేష్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అడ్డి కేశవులు, పిన్నాని కోటేశ్వర్‌రావు, దొంగరి సైదులు, పిన్నాని జనార్దన్, సునిల్, నవీన్, శివ నాయక్, జానిమియా, సతీష్, అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రం, నాగరాజు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలోని కొమ్మాల గ్రామంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి, దేవస్థాన చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, పెసర సతీష్‌రెడ్డి, బాసపోలు శ్రీనివాస్, కుంటిగొర్ల శ్రీనివాస్, బొరోజు ఉపేందర్, నాయకులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి ప్రపంచంలోనే భారతదేశానికి గొప్ప పేరు తెచ్చిన మహానీయుడు రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పల రాంబాబు యాదవ్, రామాలయం చైర్మన్ ఎలగందల సంజీవ, సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ కొండ రాజు, మాచర్ల అనిల్ క్యాస్ట్రో, వీరబోయిన గంగరాజు యాదవ్, అక్కనపల్లి నరేష్, కరీం, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్, నాయకులు ఎర్ర యాదగిరి, జాజుల వీరయ్య, కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, ఎల్మకంటి సోమన్న, కండె అంజయ్య, వెంకన్న, జనార్దన్, మల్లేష్ పాల్గొన్నారు.


పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సురేష్‌రావు


అర్వపల్లి : కొమ్మాలలో నివాళులర్పిస్తున్న యోగానందచారి, కాంగ్రెస్ నాయకులు


భానుపురి (సూర్యాపేట) : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మద్దిరాల : ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో ఎఫ్‌టీఓ ఆధ్వర్యంలో, రామచంద్రపురం గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కోటిరత్నం

నూతనకల్ : వ్యాధులు ప్రభలకుండా వైద్య సిబ్బంది టీకాలను సకాలంలో వేసి వాటి నివారణకు కృషి చేయాలని జిల్లా టీకాల నియంత్రణ అధికారి కోటిరత్నం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, గర్భిణుల వ్యాధి నివారణ కోసం వైద్య శాఖ అందిస్తున్న టీకాలు వేయాలని కోరారు. ఆమె వెంట మండల వైద్యాధికారి లిఖిత్, సీహెచ్‌ఓ శరణ్‌నాయక్, పీహెచ్‌ఎన్ తారమ్మ, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగశాలతో విద్యార్థులకు మేలు

సూర్యాపేట అర్బన్ : ప్రయోగశాలలతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని, సంచార ప్రయోగశాలను సద్వినియోగం చేసుకోవాలని బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా బాలభవన్ వేసవి శిక్షణ శిబిరానికి హాజరయ్యే బాల బాలికల కోసం అగస్త్య ఫౌండేషన్, సువెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా సంచార ప్రయోగశాల సర్వీస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైన్స్ ప్రయోగాలు ప్రత్యక్షంగా చూస్తూ చేస్తూ అనుభూతిని పొందడంతో ఎక్కువ అవగాహన కలగడమే కాకుండా ఎక్కువ జ్ఞాపకం పెట్టుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. తద్వారా భవిష్యత్తులో బాలబాలికలు సైన్స్ సబ్జెక్ట్ పై ఆసక్తి పెంచుకుంటారని తెలిపారు. అనంతరం సువేన్ ట్రస్ట్, అగస్త్య ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంచార ప్రయోగశాల, బాల్ భవన్ స్టాఫ్, చిన్నారులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు శిక్షణ

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కాలేజీల్లో చదువుకొని ఉపాధి అవకాశాలు లేని విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఇమాంపేట గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. పద్మ బుధవారం తెలిపారు. 19నుంచి 25 సంవత్సరాలు మధ్య వయసు కలిగిన గురుకుల పూర్వ విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఇన్ఫోసిస్ సౌజన్యంతో విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు శిక్షణకు అర్హులన్నారు. ఈ శిక్షణ 30రోజుల పాటు కొనసాగనున్నట్లు తెలిపారు. వివరాలకు పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కత్తి ఉపేందర్‌కు దళితరత్న అవార్డు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామానికి చెందిన కత్తి ఉపేందర్ దళితరత్న అవార్డు అందుకున్నారు. సికింద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ఇటుక రాజు అవార్డు అందజేసినట్లు బుధవారం తెలిపారు.